


quicktodaynews.com RNI NO : TELTEL/2023/86487

# క్విక్ టుడే

QUICK TODAY DAILY దినపత్రిక
తెలంగాణ



## భారత్ అనూహ్య ఓటమి

సొంతగడ్డపై భారత్‌కు భంగపాటు ఎదురైంది. పెట్టని కోటలాంటి పిచ్‌లపై ప్రత్యర్థి చేతిలో అనూహ్య ఓటమి పలుకరించింది. వరుణుడి అంతరాయం మధ్య సాగిన బెంగళూరు టెస్టులో న్యూజిలాండ్ చేతిలో టీమ్ఇండియా భారీ ఓటమి చవిచూసింది.

EDITOR : GILLALA BUCHI REDDY. 8125972476 | మల్కాజిగిరి | సంపుటి : 2 సంచిక : 41 | సోమవారం 21 అక్టోబర్ 2024 | వెల : 3 రూ/.. | పేజీలు - 8



### గొప్ప పనులు చేయాలంటే

# రిస్క్ తీసుకోవాల్సిందే

### ఐఎస్‌బీ నాయకత్వ సదస్సు 2024 లో సీఎం రేవంత్ రెడ్డి

### లీడర్ షిప్ ఇన్ న్యూ ఇండియా అంశంపై ప్రసంగం

### హైదరబాద్ ను ప్రపంచస్థాయి నగరంగా నిలబెట్టాలి

**హైదరాబాద్, అక్టోబర్20 (క్వక్ టుడే న్యూస్) :** జీవితంలో గొప్ప పనులు చేయాలంటే కొంత రిస్క్ తీసుకోవాలని, రిస్క్ తీసుకోకుండా లక్ష్యాలను సాధించలేమని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి గారు అన్నారు. మంచి నాయకుడిగా ఎదగాలంటే ధైర్యం, త్యాగం కీలకమైన అంశాలన్నారు. ఐఎస్‌బీ నిర్వహించిన నాయకత్వ సదస్సు 2024 లో పాల్గొన్న ముఖ్యమంత్రి లీడర్ షిప్ ఇన్ న్యూ ఇండియా అంశంపై ప్రసంగించారు. హైదరబాద్ నగరాన్ని ప్రపంచస్థాయి నగరంగా నిలబెట్టడంలో అందరి సహకారం కావాలని సదస్సులో కోరారు. దేశంలోని నగరాలతో కాకుండా, న్యూయార్క్, ప్యారిస్, టోక్యో , సియోల్ వంటి నగరాలతో హైదరాబాద్ పోటీ పడాలని కోరుకుంటున్నట్టు ముఖ్యమంత్రి గారు చెప్పారు. ఐఎస్బీ విద్యార్థులు హైదరాబాద్, తెలంగాణతో పాటు న్యూ ఇండియాకు బ్రాండ్ అంబాసిడర్లు అని, తెలంగాణను ట్రిలియన్ ఎకానమీ ఆర్థిక వ్యవస్థగా మార్చాలన్న లక్ష్యసాధనలో సహకరించాలని, వెళ్లే ప్రతి చోట తెలంగాణ, హైదరాబాద్ గురించి మాట్లాడాలని సూచించారు.



రాష్ట్రంలో స్కిల్స్ యూనివర్సిటీ, గచ్చిబౌలిలో స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నామని, హైదరాబాద్ నగరాన్ని దేశానికి ఒక రోల్ మాడల్ గా, గ్లోబల్ లీడర్ గా తీర్చిదిద్దాలన్నదే తమ ఆలోచన అని ముఖ్యమంత్రి గారు చెప్పారు.



### నేటి నుంచి

# గ్రూప్-1 మెయిన్స్

### 27వరకు కొనసాగనున్న పరీక్షలు

### పరీక్షా కేంద్రాల వద్ద భారీ పోలీస్ బందోబస్తు

**హైదరాబాద్, అక్టోబర్20 (క్వక్ టుడే న్యూస్) :** గ్రూప్-1 పరీక్షలకు భారీ భద్రత ఏర్పాటు చేయనుంది తెలంగాణ ప్రభుత్వం. అభ్యర్థుల ఆందోళనతో అలర్ట్ అయిన అధికారులు.. సోమవారం నుంచి 27 వరకు గ్రూప్-1 పరీక్షలు నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 1:30 తర్వాత పరీక్షా కేంద్రంలోకి ఎలాంటి అనుమతి ఉండదు. దివ్యాంగులకు ప్రత్యేకంగా గంట పాటు అదనపు సమయం కేటాయించనున్నారు అధికారులు. పరీక్ష హాల్, పరిసరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు. అలాగే బయోమెట్రిక్ కోసం ప్రత్యేక సిబ్బంది ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 46 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా, 31,383 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని తెలుస్తోంది. మేడ్చల్ గ్రూప్-1 పరీక్షా కేంద్రం దగ్గర 144 సెక్షన్ విధించనున్నారు. ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. దీనికోసం 46 పరీక్షా కేంద్రాలు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. జిల్లా కలెక్టర్ల పర్యవేక్షణలో ఏర్పాట్లు, పరీక్షలు నిర్వహించేందుకు సిద్ధమైనట్లు తెలిపారు. 2011 సంవత్సరం తర్వాత గ్రూప్ -1 మెయిన్స్ పరీక్షలు మళ్ళీ జరుగుతున్నాయని తెలిపారు. హైదరాబాద్ జిల్లాలో 8 , రంగారెడ్డి జిల్లాలో 11 , మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 27 మొత్తం 46 కేంద్రాలలో గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రతి పరీక్ష హాల్, చీఫ్ సూపరింటెండెంట్ రూమ్, పరిసర ప్రాంతాలన్నింటిలోనూ సీసీ టీవీ లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే టీజీపీఎస్సీ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుండి 5 గంటల వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు. అలాగే పరీక్షా కేంద్రాల వద్ద వైద్య సదుపాయం కూడా ఉంటుందని, అన్ని కేంద్రాలకు ప్రత్యేక ఆర్టీసీ బస్సుల ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.

# నెల రోజుల్లో అందుబాటులోకి చర్లపల్లి రైల్వే టెర్మినల్

### త్వరలోనే యాదాద్రికి ఎంఎంటీఎస్ పనులు ప్రారంభిస్తాం

### చర్లపల్లి స్టేషన్‌లో పనులను పరిశీలించిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



హైదరాబాద్, అక్టోబర్20 (క్వక్ టుడే న్యూస్) : హైదరాబాద్‌లో అత్యాధునిక హంగులతో రూపుదిద్దుకున్న చర్లపల్లి రైల్వే టెర్మినల్‌ను కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పరిశీలించారు. సౌత్ సెంట్రల్ రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్‌తో కలిసి చర్లపల్లి స్టేషన్‌లో పర్యటించిన ఆయన.. పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. తెలంగాణలో రైల్వేలకు సంబంధించిన మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్రం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు కిషన్‌రెడ్డి. చర్లపల్లిలో రూ.430 కోట్లు వ్యయంతో కొత్త రైల్వే టెర్మినల్‌ను నిర్మిస్తున్నట్టు తెలిపారు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి. త్వరలోనే ఇది అందుబాటులోకి వస్తుందన్నారు. ఇది ప్రారంభమైతే సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌పై భారం తగ్గుతుందని.. ట్రాఫిక్ సమస్యలు కూడా తగ్గుతాయన్నారు. చర్లపల్లి నుంచి నగరంలోకి రోడ్ కనెక్టివిటీ పెంచాల్సిన అవసరం ఉందన్నారు. పనులు పూర్తి కాగానే ప్రధాని మోదీ చేతుల మీదుగా చర్లపల్లి టెర్మినల్‌ను ప్రారంభిస్తామని తెలిపారు. త్వరలోనే యాదాద్రికి ఎంఎంటీఎస్ పనులు ప్రారంభిస్తామన్నారు కిషన్ రెడ్డి. కొమురవెల్లిలోనూ రైల్వే స్టేషన్ నిర్మాణం జరుగుతోందని.. ఇవి పూర్తయితే యాదాద్రితో పాటు కొమురవెల్లికి రైళ్లు ప్రారంభిస్తామని తెలిపారు. హైదరాబాద్‌లో నాలుగో అతిపెద్ద రైల్వే స్టేషన్‌గా చర్లపల్లి రూపొందుతోంది. సుమారు 430 కోట్లతో ఎయిర్‌పోర్టును మైమరపించేలా ఈ రైల్వే టెర్మినల్‌ను కేంద్రం అద్భుతంగా నిర్మించింది. ఇక.. చర్లపల్లిలో ఇప్పటికే ఐదు ప్లాట్ ఫామ్‌లు ఉండగా.. వీటికి అదనంగా మరో 4 ప్లాట్ ఫామ్‌లు రెడీ చేశారు. మొత్తం.. 9 ప్లాట్‌ఫామ్‌లు, 9 లిఫ్టులు, 5 ఎస్కలేటర్లు, రెండు ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలతో చర్లపల్లి రైల్వే టెర్మినల్ నిర్మితమైంది. దాదాపు పనులు పూర్తి కావడంతో త్వరలో ప్రధాని మోదీ ప్రారంభించనున్నారు. దాంతో.. వందేళ్ల తర్వాత హైదరాబాద్‌లో కొత్త అతిపెద్ద రైల్వేస్టేషన్ అందుబాటులోకి రానుంది.

### వారసత్వం లేని

# రాజకీయాల్లోకి రండి

### యువతకు ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు

### వారసత్వ రాజకీయాలతో దేశానికి తీరని నష్టం

### వారణాసిలో రూ.6,700 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభం



**వారణాసి, అక్టోబర్ 20:** కాంగ్రెస్, సమాజ్‌వాది పార్టీ(ఎస్పీ)లపై ప్రధాని నరేంద్ర మోదీ విరుచుకపడ్డారు. ఆ రెండు పార్టీలు వారసత్వ రాజకీయాలకు (నెపోటిజం) పాల్పడుతున్నాయని ధ్వజమెత్తారు. ఉత్తర ప్రదేశ్‌లోని వారణాసిలో రూ.6,700 కోట్లతో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించి మాట్లాడుతూ ప్రధాని మోదీ.. ప్రతిపక్షాలపై తీవ్రస్థాయిలో విరుచుకపడ్డారు. వారణాసి అభివృద్ధిని పక్కనపెట్టి ఆ రెండు పార్టీలు వారసత్వ రాజకీయాలకు పాల్పడ్డాయని ఆరోపించారు. రాజకీయ వారసత్వం లేని యువకులు రాజకీయాల్లోకి రావాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. రాజకీయాల్లో ఉంటూ వారు దేశాభివృద్ధి కోసం కృషి చేయాలన్నారు. వారసత్వ రాజకీయాల కారణంగా దేశ యువతకు తీరని నష్టం కలిగిందని ప్రధాని మోదీ ఆరోపించారు. పదేళ్ల క్రితం వరకు వారణాసి అభివృద్ధికి ఆమడదూరంలో ఉండేదని.. ఇప్పుడు ఆ పరిస్థితిలో మార్పు వచ్చిందన్నారు. యూపీ, ఢిల్లీలో సుదీర్ఘకాలం అధికారంలో ఉన్న కాంగ్రెస్, ఎస్పీ వారణాసిని ఎందుకు పట్టించుకోలేదని ఆయన సూటిగా ప్రశ్నించారు. భవిష్యత్తులోనూ వారణాసి అభివృద్ధికి కాంగ్రెస్, ఎస్పీలు ప్రాధాన్యత ఇవ్వబోవని అన్నారు. సబ్‌కా వికాస్ లక్ష్యంతో బీజేపీ ప్రభుత్వాన్ని నడుపుతోందని ప్రధాని మోదీ అన్నారు. ప్రజలకు అన్ని మౌలిక వసతులు కల్పించడంతో పాటు యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రజలకు వసతులు పెంచేందుకు దేశంలో కొత్త రహదారులు, రైల్వే ట్రాక్‌లు, విమానాశ్రయాలు నిర్మిస్తున్నట్లు గుర్తుచేశారు. పట్టణాభివృద్ధి అంటే వారణాసి గుర్తుకు వచ్చేలా.. ఈ నగరాన్ని అభివృద్ధి చేస్తామన్నారు.



### జీవో 29తో రిజర్వ్‌డ్ కేటగిరీలకు

# ఎలాంటి నష్టం లేదు

### గ్రూప్-1 వివాదంపై పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, అక్టోబర్ 20 (క్విక్ టుడే న్యూస్):** ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 29తో గ్రూప్-1 అభ్యర్థులకు ఎలాంటి నష్టం లేదని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. తాను తెలుసుకున్న సమాచారం ప్రకారం జీవో 29 వల్ల 75 నుంచి 80 శాతం మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులే మెయిన్స్‌కు ఎంపికవుతారని తెలిపారు. అన్ని కులాల వారికి లాభమే జరుగుతుందని స్పష్టం చేశారు. సమాచారంలోపం వల్ల ఈ సమస్య ఏర్పడిందని, దీనిపై చాలా మంది అపోహ పడుతున్నారని పేర్కొన్నారు. గ్రూప్-1 వివాదం, విద్యార్థుల ఆందోళనపై ఆదివారం గాంధీభవన్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. అర్థం చేసుకొని, ప్రశాంతంగా పరీక్ష రాయాలని, రెచ్చగొట్టే వారిని అనుసరించకూడదని అభ్యర్థులకు సలహా ఇచ్చారు.





# టీడీపీ నుంచి ఆలపాటి, పేరాబత్తుల

### ఏపీలో రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థుల ప్రకటన

అమరావతి, అక్టోబర్ 20 (క్విక్ టుడే న్యూస్) : ఏపీలో రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు టీడీపీ అభ్యర్థులను ప్రకటించింది. కృష్ణా, గుంటూరు జిల్లాల అభ్యర్థిగా ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను, ఉభయ గోదావరి జిల్లాలకు పేరాబత్తుల రాజశేఖర్‌ను ఖరారు చేసింది. ఈ మేరకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ ఒక ప్రకటన విడుదల చేశారు. గత సార్వత్రిక ఎన్నికల సమయంలో ఆలపాటి రాజేంద్రప్రసాద్ తెనాలి అసెంబ్లీ సీటును ఆశించారు. అలాగే రాజశేఖర్ కాకినాడ రూరల్ సీటును ఆశించారు. కానీ పొత్తులో భాగంగా ఆ రెండు సీట్లు జనసేన పార్టీకి వెళ్లాయి. దీంతో పార్టీ కోసం వారిద్దరూ పోటీ నుంచి తప్పుకున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని వారికి ఎమ్మెల్సీలుగా టీడీపీ అధిష్టానం అవకాశం కల్పించింది.